క్లుప్తంగా

బైక్ చోరీ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ ప్రాంతంలోని ధర్మారం రైల్వే గేటు వద్ద పార్క్ చేసిన బైక్ చోరీకి గురైంది. వివరాలిలా.. జాన్‌పాక సమీపంలోని ఆదర్శన గర్‌కు చెందిన ఇండ్ల ప్రశాంత్ తన ద్విచక్ర వాహనాన్ని (ఏపీ 36 ఏటీ 9950) శనివారం ధర్మారం రైల్వే గేటు వద్ద పార్క్ చేసి పని కోసం వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం వెళ్లి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వేశ్వర్ తెలిపారు.

కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పర్వతగిరి : మండలంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం... మండలంలోని తీగరాజుపల్లి క్రాస్ వద్ద ఉన్న ఎస్సారెస్పీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎంలో భద్రపర్చారు. సంబంధీకులు సెల్ నంబర్ 8712685242లో ఎస్సైని, 8712685028 నంబర్‌లో పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా వరంగల్ నగరానికి ఇసుక తరలిస్తున్న 11 ఇసుక ట్రాక్టర్లను ఐనవోలు పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆకేరు వాగు నుంచి అక్రమంగా సింగారం గ్రామం గుండా వరంగల్ పట్టణానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం ఉదయం తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 11 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే భారీ పెనాల్టీతో పాటు కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై పస్తం శ్రీనివాస్ హెచ్చరించారు.

23న సర్దార్ సయ్యాట వేడుకలు

ఖిలా వరంగల్ : ఈనెల 23న సాయంత్రం 5 గంటలకు మధ్యకోట ఖుష్‌మహల్ మైదానంలో సర్దార్ సయ్యాట వేడుకలు జరగనున్నాయి. వేడుకల్లో హర్యానా దున్నపోతుల ఆటలతో నూతన ఉత్సాహం కలిగేలా సంబురాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సన్మానం

ఖిలా వరంగల్ : ఇటీవల విడుదలైన గ్రూప్–2 ఫలితాల్లో పెరకవాడకు చెందిన తొటం అరుణ్ కుమార్ 98వ ర్యాంక్ సాధించి సెక్రటరేట్‌లో జీడీప డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఆదివారం అరుణ్‌కుమార్‌ను జిల్లా పద్మశాలి గౌరవ అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసమ సతీష్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మూర్తి, బైరి శ్యాం, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

తొర్రూరు రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైనా ముగ్గురిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి కోళ్ల లోడ్‌తో మరిపెడ నుంచి తొర్రూరుకు వస్తున్న డీసీఎం వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో వరంగల్ నుంచి ఖమ్మం వైపు ఎదురుగా వెళ్తున్న లారీని మండలంలోని మాటేడు శివారులో జాతీయ రహదరిపై ఢీకొట్టాడు. దీంతో డీసీఎం వాహనం బొల్తాపడగా అందులో ఉన్న డ్రైవర్ రామానుజం, కోళ్ల కంపెనీ సూపర్‌వైజర్ దయాకర్, లేబర్ రాజయ్య తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు తీవ్ర గాయాలతో ఉన్న రామానుజం, దయాకర్, రాజయ్యలను 108 వాహనంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా, చికిత్స పొందుతూ డ్రైవర్ రామానుజం, సూపర్‌వైజర్ దయాకర్ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహాచండీ హోమం

తొర్రూరు : డివిజన్ కేంద్రంలోని భద్రకాళి ఆలయంలో మహాచండీ హోమాన్ని అత్యంత వైభవంగా ఆదివారం నిర్వహించారు. ప్రధానంగా ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, గోపి శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ హోమం, ప్రత్యేక పూజ నిర్వహించారు. లను నిర్వహించగా, వందలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మేరుగు మల్లేశంగౌడ్, రేవూరి వెంకన్న, అన్వర్, వంశీ, శ్రీకర్, దుర్గాప్రసాద్, శశికుమార్ పాల్గొన్నారు.

పాస్టర్స్ కమిటీ ఎన్నిక

తొర్రూరు : స్థానిక సంఘం కార్యాలయంలో పాస్టర్స్ మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పీటర్, కోశాధికారిగా ధర్మరావు మహేందర్, ఉపాధ్యక్షుడిగా ఈనెపల్లి యాకుబ్, సంయుక్త కార్యదర్శిగా సంతోశ్, కార్యవర్గ సభ్యులుగా వెల్తూరి తిమోతి, భూక్య వెంకన్ననాయక్, గౌరవ అధ్యక్షుడిగా గుండాల నర్సయ్య, ముఖ్య సలహాదారులుగా ధర్మరావు డేవిడ్‌రాజు, సుకుమార్‌లు ఎన్నికైయ్యారు.

గిరిజనతండాల్లో విద్యుత్ వెలుగులు

- నిరుపేద కుటుంబాలకు లబ్ధి
- 'పీఎం–జుగా' అమలుపై హర్షం

దుగ్గొండి : గిరిజనతండాలు.. ఊరికి దూరంగా ఆవాసాలు.. మంచినీటి, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలకు నోచుకోని పరిస్థితి.. నూతన గ్రామ పంచాయతీలుగా ఆవిర్భవించక ముందు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండేవి. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం గిరిజన గూడేల్లో విద్యుత్ కాంతులు విరజిమ్ముతోంది. గిరిజన తండాలు, గూడేల్లో మౌలిక సదుపాయాలు కల్పించి సామాజిక అంతరాలను పూరించి షెడ్యూల్డ్ తెగల సమ్మిలత అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గతేడాది పీఎం–జుగా పేరుతో ప్రధానమంత్రి జన జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ పథకాన్ని తీసుకొచ్చింది. మండలంలో ఈ పథకం అమలుపై 'సాక్షి' కథనం..

మండలంలోని రాజ్యాతండా, నారాయణతండా, పీజీతండా, గోబ్రియాతండా, మంగళితండా గ్రామాల్లో అధికారులు, సిబ్బంది కొత్తగా విద్యుత్ లైన్లు వేస్తున్నారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నెలకొల్పి విద్యుత్ తీగలు లాగుతున్నారు. ఈ 5 తండాల్లో మొత్తం 702 గృహాలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. లబ్ధిదారుకు మీటరుతోపాటు సర్వీస్ వైరు, కనెక్షన్ ఉచితం కావడం గమనార్హం. వీధుల్లో విద్యుత్ స్తంభాలకు అధునాతన వీధిదీపాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సదరు తండాల్లో 10 రోజులుగా విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పాత విద్యుత్ లైన్లను సరి చేస్తుండడంతోపాటు నూతన విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. ప్రతి ఇంటికీ సర్వీస్ వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తండాల్లో విద్యుత్ వెలుగులు సంతరించుకుంటుండటంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రాజ్యాతండాలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

గూడేలకు నూతన అందం



కేంద్ర ప్రభుత్వం గిరిజనతండాల్లో, గూడేల్లో పాత విద్యుత్ లైన్లు సవరించడంతోపాటు కొత్త విద్యుత్ స్తంభాలు వేస్తుండటంతో పల్లెల్లో కొత్త అందం సంతరించుకుంటోంది. విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లతోపాటు ప్రతి ఇంటికీ సర్వీస్ వైర్లకు క్రమ పద్ధతిలో ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించొచ్చు. నాణ్యమైన విద్యుత్ అందుతుంది.

– నునావత్ రమేశ్, పీజీతండా

అర్హులందరికీ కనెక్షన్ ఇవ్వాలి



గిరిజనతండాల్లోని అర్హులందరికీ కనెక్షన్లు ఇవ్వాలి. సంఖ్యాపరమైన షరతులు లేకుండా ఒకే దఫాలో పేదలకు, అన్ని వీధులకు విద్యుత్ వెలుగులు అందించాలి. శివార్ల వరకూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేయాలి. పనుల్లో పారదర్శకత కీలకం. అధికారులు, సిబ్బంది కూడా ప్రభుత్వ లక్ష్యం మేరకు పథకాన్ని అమలు చేయాలి.

– బానోతు రవీందర్, రాజ్యాతండా

20 రోజులుగా పనులు

మండలంలో 20 రోజులుగా 'పీఎం–జుగా' పథకం పనులు చేస్తున్నాం. పలు చోట్ల నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైన్లు వేస్తున్నాము. అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా ఏర్పాట్లు చేస్తున్నాము. అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఇంటికీ ఉచితంగా మీటరు అమర్చి సర్వీసు వైరుతో కనెక్షన్ ఇస్తున్నాము.

– ప్రత్యూష, ఏఈ, ట్రాన్స్‌కో

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

- జీఎంపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగయ్య

నర్సంపేట : గొల్ల కురుమల, గొర్ల కాపరుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాడబోయిన లింగయ్య విమర్శించారు. పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్ల మల్లయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి లింగయ్య హాజరై మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే ఏటా గొర్రెలు, మేకలకు మూడు సార్లు నట్టల మందు పంపిణీ జరిగిందన్నారు. రెండేళ్లుగా నట్టల నివారణ మందు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. పశు వైద్యశాలల్లో మందులు, సిబ్బంది లేకపోవడంతో మూగజీవాల మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీలో భాగంగా రూ.2 లక్షలు నగదు బదిలీ చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ముఖం చాటేసిందన్నారు. గొల్ల కురుమలు ప్రమాదంలో మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అన్ని గ్రామాల్లో పశు వైద్యశాలలు ఏర్పాటు చేయాలని, వెటర్నరీ ఉద్యోగ ఖాళీలని టీఎస్‌పీఎస్సీ సత్వరమే భర్తీ చేయాలని, మూగజీవాల చికిత్సకు అవసరమైన మందులు సరిపడా అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్, జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మల్లేశ్, రాజులపాటి సూరయ్య, జక్కుల రవి, షేర్ల రాజ్‌కుమార్, నాంచారి కుమారస్వామి, బూస రాజు, జక్క వెంకన్న, బోయిని నాగరాజు, గజ్జి కుమార్, గాదం సమ్మయ్య, నానబోయిన కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

ఐక్యతతోనే బీసీ రిజర్వేషన్లు సాధ్యం

ఖానాపురం : బీసీలు ఐక్యంగా ఉంటేనే 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమవుతాయని బీసీ జేఏసీ మండల కన్వీనర్ బందారపు శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్లను అగ్రవర్ణాలు అడ్డుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. బీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ బంద్‌లో పాల్గొని విజయవంతం చేసిన మండల ప్రజలకు, వ్యాపారులకు, ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సమన్వయంతో పని చేయాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

ఖానాపురం : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ కోరారు. మండలంలోని పాకాలలో ఆదివారం నిర్వహించిన పార్టీ అశోక్‌నగర్ గ్రామ కమిటీ సమన్వయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న తప్పుడు విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు బండి వెంకన్న, ముచ్చ యాదగిరిరావు, దేవేందర్‌రావు, ఉపేందర్ రెడ్డి, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

రాజుపేటలో దొర, పటేల్ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న దొర ఏనుగు (కల్తి) నారాయణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఏజెన్సీ పరిధిలోని రాజుపేటలోని కోమురం భీం కాలనీలో గౌరవ అధ్యక్షుడు వాసం పాపయ్య, భూయజమానురాలు ఈక సారమ్మ సమక్షంలో ఆదివాసీలు ఆదివారం దొర, పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దొరగా ఏనుగు (కల్తి) నారాయణ, పటేల్‌గా దనసరి శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో దొర నారాయణ, పటేల్ శ్రీను మాట్లాడారు. కాలనీలోని నివాసం ఉంటున్న ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీరబోయిన సమ్మయ్య, మోకాళ్ల సమ్మయ్య, చాట్ల పొట్టయ్య, కల్తి ఆనందరావు, వాసం యాకలక్ష్మి, ఎర్ర పూనెం, రామూర్తి, గట్టి కమలాకర్, వాసం స్వరూప, కల్తి ప్రభాకర్, కుంజ నాగభూషణం, చాట్ల నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

ఖిలా వరంగల్ : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. రంగశాయిపేట మహంకాళి ఆలయ సమీపంలో కిరణ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా నరేందర్ హాజరై మాట్లాడారు. తొలుత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ తర్వాత 42వ డివిజన్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు పూసల కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ అభివృద్ధి సాధించేందుకు కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ పార్టీ మాత్రమే ప్రత్యామ్నాయమని తెలిపారు. రానున్న రోజుల్లో తూర్పు గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగరవేయటమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం 42వ డివిజన్‌లో హామీలను మరిచిన కాంగ్రెస్‌పై ఇంటింటికి బాకీ కార్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.రమేష్‌బాబు, ప్రవీణ్, కొంతం మోహన్, పూల కార్తీక్, నీల రాజు, విష్ణు, శివాజీ, సాగర్, రవీందర్, కిరణ్, రాజేందర్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

- ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి

ఖిలా వరంగల్ : ఈడబ్ల్యూఎస్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలని, ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పక్కగా అమలు చేయాలని ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ హంటర్ రోడ్డు ఓపెన్ బిర్లా మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఓసీ సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ఓసీ ప్రతినిధులు గంగు ఉపేంద్రశర్మ, దుబ్బ శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన అగ్రకుల పేదల ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ అన్ని కులాలకు రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు ఇచ్చిన ఏడున్నర దశాబ్దాలకు పైగా అమలు చేస్తున్నాయన్నారు. అనంతరం పలు తీర్మానాలను సదస్సు ముందు ఉంచగా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో రాయపాటి వెంకటేశ్వర్‌రావు, రామారావు, సంజీవరెడ్డి, వేణుగోపాల్, వంగేటి అశోక్, పాపారావు, నర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, 600 మంది ఓసీలు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి గుంతలమయం

- ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం

సంగెం : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ అండ్ బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడునా గుంతలు పడడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు సమస్య పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వరంగల్ నుంచి మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న మండల పరిధిలోని గవిచర్ల నుంచి తీగరాజుపల్లి వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర దారిలో సుమారు 30కిపైగా గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కో గుంత ఒకటి నుంచి రెండు ఫీట్ల లోతు ఉండడంతో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. గుంతల్లోకి దిగబడిన ద్విచక్ర వాహనాలు ప్రమాదానికి గురి కావడం సహజ పరిణామంగా మారింది. కార్లు, ఆటోలు సైతం బోల్తా పడుతున్నాయి. పలు సందర్భాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన ద్విచక్ర వాహనదార్లు రోడ్డుపై ఉన్న గుంతలు తెలియక వేగంగా వచ్చి గుంతల్లో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతూ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇక వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలవడంతో లోతు తెలియక సైతం పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కార్లు, ఆటోలు, బస్సుల్లో ప్రయాణించే వ్యక్తులు గుంతల కుదుపులకు నడుము పట్టేస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సగం వరకు పగిలిపోయి కంకర తేలిన రోడ్డు, గుంతలు

పలు చోట్ల సగం రోడ్డు కట్..

రోడ్డు పలు చోట్ల ఒక పక్క సగానికి పైగా తెగిపోయాయి. రోడ్డు మంచిగా ఉన్న వైపు నుంచి ప్రయాణించాలంటే ఎదురెదురుగా వచ్చే వాహనాలతో ప్రమాదం పొంచి ఉండడంతో తెగిన రోడ్డులోంచే ద్విచక్ర వాహనదార్లు, ఆటోవాలాలు నానా అగచాట్లు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో పగిలిన రోడ్డు కనపడక వాహనదార్లు కుదుపులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నడుము దెబ్బతింటోందని, వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి దాదాపు రాత్రి 10, 11 గంటల వరకు వాహనాల రాకపోకలు సాగుతుండగా రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించడంలో అధికారులు చొరవ చూపడం లేదంటూ మండల ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈ శేఖర్‌ను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

గుంతలను సత్వరమే పూడ్చాలి

గవిచర్ల నుంచి తీగరాజుపల్లి వరకు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను త్వరితగతిన పూడ్చాలి. ప్రయాణికులు గుంతల్లో పడి ఆస్పత్రి పాలవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

– యార రఘు, గ్రామస్తుడు, గవిచర్ల

గ్యార్మీ షరీఫ్ వేడుకలు

ఖిలా వరంగల్ : వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లో గౌస్‌పాషా, ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్మీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ నేత గోపాల నవీన్‌రాజు, సామాజిక వేత్త మేరుగు అశోక్ హాజరై వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. హిందువులు, ముస్లింలు సమష్టిగా గ్యార్మీ వేడుకలు జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ.షౌకత్, మహ్మద్ మహమూద్, మహ్మద్ యాకూబ్, అఫ్జల్, యాకూబ్, గద్దం రవి, శివ తదితరులు పాల్గొన్నారు

పోచమ్మగుడికి రేకుల షెడ్ ఏర్పాటు

ఖిలా వరంగల్ : తూర్పుకోటలోని శ్రీ పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో నలివేల జయ, రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్ ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై రూ.2లక్షలతో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బోగి సురేష్, ఎల్లయ్య, వాసుదేవ్, మహేష్, వీరస్వామి, చందర్, దూడయ్య, కుమార్, శ్రీనివాస్, కేశవరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీపార్వతీ దేవి సమేత మహాదేవ స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు వైభవంగా జరిగాయి. అర్చకులు శ్రావణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

వరంగల్ మార్కెట్లో సరికొత్త ప్రమిదలు

ఖిలా వరంగల్ : దీపావళి పండుగ సందర్భంగా వరంగల్ మార్కెట్‌లో సరికొత్త ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. విభిన్న రంగులు, ఆకృతుల్లో ప్రమిదలను వ్యాపారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. సంప్రదాయ మట్టి ప్రమిదలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. పూసలు, బంగారు పూతతో డిజైన్ల ప్రమిదలు, రంగుల్లో పూల ఆకృతిలో ఉన్న ప్రమిదలు,రంగుల్లో పూల ఆకృతిలో ఉన్న ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు. కుండీలు, ప్లేట్లు, బాతులు, తాబేలు, దీపం, గిన్నెలు వంటి ఆకృతుల్లో కళాకారులతో అందంగా తయారు చేయించి విక్రయిస్తున్నారు. గతంలో దీపావళి అంటే ఇంటి ముందు వరుసగా పెట్టిన మట్టి ప్రమిదల్లో నూనె పోసి దీపాలను అలంకరించేవారు. ఇటీవల కాలంలో మట్టి ప్రమిదల వినియోగం, పూలను ముగ్గులా పేర్చి దీపాలను అలంకరించటం ఫ్యాషన్‌గా మారింది.



భూకబ్జాపై అధికారుల నిర్లక్ష్యం

- టీఏఎస్ జిల్లా కోకన్వీనర్ భాస్కర్

పర్వతగిరి : ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై ప్రజలు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారని తెలంగాణ అంబేడ్కర్ సంఘం (టీఏఎస్) జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్, ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లం దాస్ కుమార్ తెలిపారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. మండలంలోని సోమారంలో ఆక్రమణదారులు పూడ్చిన బావి స్థలాన్ని ప్రజాసంఘాల నాయకులు ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్, కుమార్ మాట్లాడారు. గ్రామంలోని ప్రభుత్వ మంచినీటి బావిని పూడ్చి స్థలాన్ని ఆక్రమించిన వారిపై ఈనెల 12వ తేదీన గ్రామస్తులు స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సుమారు 50 ఏళ్ల క్రితం నాటి ప్రభుత్వం గ్రామస్తుల కోసం ఏడు గోలల లోతు రాతి కట్టడంతో తవ్వించి బావి ఏర్పాటు చేయడంతోపాటు బావి చుట్టూ ఏడు గజాల వెడల్పుతో పాట్‌ఫామ్ నిర్మించిందని వివరించారు. ఆక్రమణదారులపై స్థానిక శాఖ అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణదారులపైనే కాకుండా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని కబ్జా నుంచి బావిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు మంద రవి, తాటికాయల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

'హమాలీ' మహాసభను విజయవంతం చేయాలి

పరకాల : జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న హమాలీ యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల కరపత్రాన్ని ఆదివారం పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆవిష్కరించిన అనంతరం చక్రపాణి మాట్లాడారు. హమాలీ కార్మికులు చేస్తున్న ఎగుమతులతో ప్రభుత్వానికి సెస్‌ల రూపంలో కోట్ల రూపాయాలు ఆదాయం వస్తున్నా హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పైసా ఖర్చు పెట్టకపోవడం అన్యాయమని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, పనిభద్రత కోసం ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్ష, కార్యదర్శులు తిక్కల కమల్, బొచ్చు ఆదాం, భిక్షపతి, మేకల రాజు, పెండ్యాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.